# చిత్రమాలిక

## పంతులు-శాస్త్రి

### గులాబి

తెల్లవారితే ఆదివారం. ఆఫీసుకి వెళ్ళవలసిన అవసరంలేదు. ఈ స్ఫురణ తొలినాటి సాయంకాలంనుండి కృష్ణశర్మ మనసులో మెదులుతూనే ఉంది.

రాత్రి పడుకోబోయేముందు మళ్ళీ జ్ఞాపకం చేసుకొన్నాడు, రేపు ఆఫీసుకి వెళ్ళనక్కరలేదు; మధ్యాహ్నం భోజనం చేసిన తరవాత కొంతసేపు నిద్రపోవచ్చును—ఇప్పుడు కొంచెం ఆలస్యంగా నిద్రపోయినా బాధలేదు మ్యునిసిపల్ లైబ్రరీనుండి తెచ్చి, వారం రోజులాయి చదవకుండా ఉండిపోయిన జాన్‌స్టీన్‌బెక్ నవల గ్రేప్స్ ఆఫ్ రాత్ చదవసాగాడు. అర్ధముం పన్నెండు గంటలవరకయినా చదివి, మర్నాడు ఆదివారం గనక రోజంతా పూనికగా చదివితే కాలా వరకు చదవవచ్చు ననుకొన్నాడు. కాని, పుస్తకం చదువుతూఉంటే, అలవాటు ప్రకారం పదిగంటల వేళకల్లా నిద్ర ముంచుకొని వచ్చింది. సరే కానీ, తెల్లవారుజామున చదవవచ్చుననుకొని, ఎలాగో దీపం తగ్గించి పడుకొన్నాడు. తెల్లవారుజామున మెలకువరాలేదు. పనిమనిషి వచ్చి తలుపు పిలవడంతో యంత్రవతుగా లేచి వెళ్ళి తలుపు తీసి వచ్చి మళ్ళీ పడుకొన్నాడు.

పనిమనిషి తన పని పూర్తిచేసుకొని, బొగ్గులకుంపటి అంటించి, నీళ్ళుపడేసి, పాలవాడు తెచ్చిఇచ్చిన పాలు తీసుకొని, తనకు వెళ్ళిపోవలసిన వేళయింది, బాబుగారిని లేపడమా మానడమా అనుకొంటూ ఉండగా లేచి పెరట్లోకి వచ్చాడు కృష్ణశర్మ.

బల్లమీద కూర్చొని కొనుపుల్లతో పళ్ళు తోముకోడం ఆరంభించాడు శర్మ.

పనిమనిషి తాను అంతసేపూ చేసిన పనులు ఏకరువుపెట్టి, తనకు అప్పటికే ఆలస్యం అయిందనీ, రామంబాబుగారి ఇంటి పనికి వెళ్ళిపోవాలనీ అంటూ వెళ్ళిపోయింది.

కృష్ణశర్మ పనిమనిషిమాటలు విన్నాడే గాని సరిగా బోధపరచుకోలేదు.

అతని దృష్టి అంతా ఎదురుగా ఉన్న గులాబీ మొక్కమీదనే ఉంది.

అది ఇన్నాళ్ళూ ఊరుకొని ఊరుకొని ఇవాళ ఒక్కటంటే ఒక్క పువ్వు పూసింది; అంటే ఏ రెండు మూడు రోజులక్రితమో మొగ్గపెట్టి ఉండాలి. తాను చూడనేలేదు. అయితే ఇదే బాగుంది, మొగ్గనూ చూసి, ఇవాళ పూస్తుంది, రేపుపూస్తుంది అనుకోడంకంటే గులాబీపువ్వు, ఎంత అందంగా ఉంది!

గులాబీపువ్వు తనకేం కొత్తకాదు. ఇది మరీ పెద్దపువ్వు కాదుగాని, ఒక మాదిరిగా పెద్దదే.

ఏమిటీ రేకులపేర్పు! ఎంత మృదువుగా, తీయనైన వాసన కలిగిఉంది. ఎక్కడనుండి ఉద్భవించింది? ఈ మట్టిలో నుండేనా? ఈ మట్టిలో ఇంతటి రమణీయమయిన రంగులకి ఆధారభూతమయిన ఏదో సూక్ష్మకణ సముదాయం గర్భితమై ఉందన్నమాట? ఈ సువాసన ఎక్కడనుండి వచ్చింది? ఈసువాసన ఎంతోసేపు ఉండదు కొంచెం వేడిగా ఎండ సోకడంతో అంతరించిపోతుంది. అయితేనేం తన పెరటిలో, తన ప్రయత్నం ఎంతమాత్రంలేకుండా ఒక గులాబీ పూసింది.

బల్లమీద కూర్చున్నవాడల్లా లేచి మొక్క చుట్టూ ప్రదక్షిణం చెయ్యసాగాడు.

మొగం కడుక్కొన్న తరవాత కాఫీ సంగతికూడా ఆలోచించకుండా మొక్కకి సంరక్షణ చెయ్యడం ప్రారంభించాడు.

పాపం, సరోజ, ఈ మొక్కగురించి ఎంత తాపత్రయపడ్డాది - వీళ్ళింటినుండి వాళ్ళింటినుండి కత్తిరించిన కొమ్మలు తెచ్చి నాటుతూ ఉండేది. చిన్నపిల్లలకు చేసినట్టుగా వాటికి సంరక్షణ చేస్తూఉండేది. అవి బతికినట్టే కనిపించేవి. ఒకటి రెండు చిగుళ్ళు కూడా పెట్టి, క్రమంగా వాడిపోయేవి—ఎండిపోయి, పుల్లల్లాగ అయిపోయినా తీసిపారెయ్యడానికి తనకి మనసొప్పేదికాదు.

"ఎందుకంత శ్రమపడతావు, అవి వేళ్ళు తన్ని మొక్కలయి, పూలు పూయడం ఎప్పుడు? నువ్వు పెట్టుకోడం ఎప్పుడు? ఒక రెండణాలు పెట్టి పువ్వులు కొనుక్కొంటే సరిపోలేదా?" అనేవాడు తాను.

ఆమెమాత్రం తన పట్టుదలను విడిచిపెట్టేదికాదు. సన్నగా ఎనిమిదడుగుల వెడల్పులోని ఆ పెరటిలోఉన్న కొద్దిపాటిస్థలంలో ఒక నందనవనం విలసిల్ల చెయ్యాలని ఆమె తాపత్రయం. మల్లెమొక్కలు పెంచింది; మల్లెమొగ్గలు కొనుక్కొనవసరం లేకుండా నిత్యకృత్యం గడిచిపోయేలా చేసింది.

తాగడానికే మంచినీళ్ళు దొరకడం కష్టమయినస్థలంలో పువ్వుల మొక్కలకికూడా నీళ్ళు తెచ్చి పోసేది. వెళ్ళిపోయేటప్పుడు పనిమనిషితో మరీమరీ చెప్పి వెళ్ళింది, మొక్కలకి నీళ్ళు పొయ్యడం మరిచిపోవద్దని.

ఇవాళ సరోజకి ఉత్తరం రాయాలి. అందులో తప్పకుండా గులాబీపూసిందని రాయాలి. ఎంత సంతోషిస్తుందో!

ఎండ బాగా చురుకుమనేవరకూ మొక్కల సంరక్షణలోనే నిమగ్నుడయి ఉన్నాడు.

కాఫీ చేసుకొని తాగి, వెళ్ళి గదిలో పుస్త


## తెలుగు ఆంగ్ల భాషాబోధిని




తెలుగు చదువ తెలిసినవారెల్లరు ఈపుస్తకంతో ఇతరుల సహాయం లేకనే ఇంగ్లీషుభాష సులభంగా చదువను, వ్రాయను, మాట్లాడను, ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం నేర్చుకోవచ్చును. ఒక పెద్దక్యాలికో బైండు పుస్తకం రు. 5/- వి. పి. రు. 1-2-0.

**కొక్కోకము:** ఇది అసలైన కొక్కోక గ్రంథము. ఫోటోలతో ఉన్నది— రు. 1/- వి. పి. రు. 0 12-0.

Vani Book Depot. P. B. No. 239, Madras-1.

కం పట్టుకొని కూర్చున్నాడు. కాని, గదిలో కూర్చోడం బాగా అనిపించలేదు - పడకకుర్చీ తెచ్చుకొని, పెరటి వరండాలో వేసుకొని కూర్చున్నాడు. పుస్తకం పట్టుకొన్నాడేగాని, చదవడం సాగలేదు. ఎంతసేపూ ఎట్టకేలకు పూసిన ఇంటి గులాబీ మీదనే దృష్టి——

చిన్నతనంలో వర్డ్స్‌వర్త్ వ్రాసిన డేఫొడిల్సు పద్యం పాఠం చెప్పేవారు. అప్పట్లో ఆ పద్యమూ బోధపడేదికాదు. అందులో ముఖ్యమయిన భాగాలకని మాష్టర్లు చెప్పిన వ్యాఖ్యలూ అలాగే అర్థమయేవి; ఏదో వల్లెవేయడం, పరీక్షలో కొంత రాయడం, ఆవెంటనే పూర్తిగా మరిచిపోవడమూ—— ఇంతే, స్కూలు చదువు.

నిజంగానే, అనుకోని స్థలంలో ఒక్కసారుగా ఎన్నో పువ్వులు కనిపించినప్పుడు కలిగే ఆనందం ఎంత గొప్పది! ఎప్పుడో ఒక్కసారు తాను చూసిన ఆ పువ్వులను తలచుకొన్నంతలో, తరవాత ఎంతకాలం వరకో, ఎటువంటి పరిస్థితిలో ఉన్నా సరే, మనస్సు ఆనందతరంగితమయి, ఆ పువ్వులతో పాటు నృత్యంచేస్తున్నట్టే ఉంటుందన్నమాట——చిన్నతనంలో పచ్చికోతగా కనిపించడంలో వింతలేదు——కాని, నిజమే ఒక వయసులో, ఒక మానసిక పరిస్థితిలో పొందిన అనుభవాలు వయోభేదంవల్ల, పరిసరాల్లోను మానసిక స్థితిలోని భేదాలవల్ల, నమ్మదగినవిగా కనబడక పోవచ్చును. ఈనాడు తాను ఒంటరిగా ఉండడంవల్ల ఈ గులాబీ పువ్వును, ఇంత ఆదరపూర్వకంగా చూడగలుగుతున్నాడు - ఇదే మామూలుగా సరోజ ఉండి, "ఏమండీ, చూసేరా! ఇది ఇలా ముళ్లుపెంచుకుంటూ పెరగడమేతప్ప ఎన్నటికీ పుయ్యదన్నారు; మన గులాబీ మొక్క పూసింది చూడండి" అనిగాని పువ్వునుతెచ్చే మాటయితే, తాను, "ఆ. పోనిద్దూ. ఇన్నాళ్లూ నువ్వు దానికింద పడిన శ్రమకి ఈ ఒక్క పువ్వేనా పూసింది ఇంతకంటె హాయిగా నాలుగు పువ్వులు కొనుక్కో కూడదూ" అనిఉండే వాడేమో.

ఇరుకు గోడల మధ్యను, రోజుకీ రోజుకీ భేదం తెలియని బ్రతుకుల్లో రోజాపువ్వు మాధుర్యం ఏమిఅనుభవించ బడుతుంది? ఎప్పుడూ ఒకటే దినచర్య——ఒకటే ఆఫీసు ఒకేరకం ఫైళ్లు——ఆఫీసర్లు మారుతూ ఉంటారు. వాళ్ళలోని భేదమల్లా సంతకం పెట్టే తీరులోనూ, ఏదైనా పనిలో పొరపాట్లు వస్తే కేకలువేసే ధోరణిలోనూ మాత్రమే.

తనకు అనుభవంలోవున్న ప్రకృతిసౌందర్య శోభంతా పబ్లిక్ పార్కుకు సంబంధించినదే. అక్కడి చెట్లూ పూలూ మాత్రమే కాదు, గడ్డిపోచా ఎంతో డబ్బుఖర్చుతో కృతకంగా సృష్టించబడినదే——

నిత్యకృత్య గమనంలో పడిన తనకు కాలభ్రమణమూ, ఋతుపరివర్తనమూ కూడా సరిగా అవగతం కాదు——చెట్లూ, పువ్వులూ, వెన్నెలలూ, మేఘాలూ, కోకిలలూ ఇవన్నీ పుస్తకలబ్ధ సామగ్రి అయి ఊరుకొంది——

తాను గుర్తించే కాలగమన వైఖరి అంతా ఇంతే. వర్షాలు ఎక్కువగా పడుతున్నాయంటే, పాతగొడుగు మరామత్తు చేయించుకోవడం, రెండేళ్ళ క్రితం కొన్న రబ్బరు జోడు మరి వాడబడదని ఎలాగో ఒక వాటర్ ప్రూఫ్ జోడు కొనుక్కోవడం——చలిఎక్కువయిందంటే, బైటికి తొడుక్కోడానికి బాగులేని స్వెటర్‌ను లోపల బనీనులాగా తొడుక్కుని, ఏనాటిదో బాగా పాతి అయిపోయిన శేజరుకోటును విడవకుండా ఫిబ్రవరి ఆఖరువరకు తొడుక్కోడం, వేసవికాలం ఉదయం ఆఫీసులన్న పేరుతో, ఉదయం ఏడుగంటల నుండి మధ్యాహ్నం రెండుగంటల వరకూ మాడడం ఇంతే...

ఇటువంటి నీరస దైనికచర్య నిర్వహించుకొనివచ్చే తాను, తాతలనాడు నేతులు తాగిన కబుర్లలాగ, ఎప్పుడో కాలేజీజీవితం రోజుల్లో రాసిన కవిత్వస్ఫురణని కాదనలేడు. ఇప్పటికీ పద్యం రాయాలంటే, పద్మాలు, కలువలూ, జ్యోత్స్నలూ, కోకిలలూ ప్రత్యక్షం కాక మానవు——నిజానికి తాను అందమైన తామరపువ్వులూ కలువపువ్వులూ నిండిన కొలను చూసి ఎన్నాళ్లయిందో?

తానేకాదు, నేటి జీవితవిధానమే అలా ఉంది. సంగీతం, కవిత్వం, చిత్రలేఖనం——ఆయా కళలను ఉపాసించాలనే వాళ్ళకి పరిసరాలు ప్రోత్సాహం కలిగించడంలేదు.

నిత్యకృత్యంలో సౌందర్య స్ఫురణకి సావకాశం లేదు; ఆనంద రసానుభూతి అనేది తమతమ జీవితాల్లో ప్రత్యక్షంగా వాంఛించడం అనేది అందని పళ్లకి అర్రులు చాచడంగా జనసామాన్య భావన అయిపోయింది; చదువుకొన్న వాళ్లకి పుస్తకాలలోనూ, అజ్ఞానులకి సినిమాల్లోనూ మాత్రమే పరోక్షంగా ఆనందలబ్ధి కలగవలసిన పరిస్థితులలో యంత్రవతుగా జీవితాలు సాగిపోతున్నాయి——రేడియో వినడమో, సినిమా చూడడమో, ఏకొద్దిమందో ఆడే ఫుట్‌బాల్ క్రికెట్ మొదలయిన క్రీడలను చూడడమో-తమకు సంబంధించిన చలనమూ, వ్యక్తిగతమయిన అనుభవమూ లేకుండా పరోక్షానుభూతినే స్వీయం చేసుకోవలసి వస్తుంది. ఇది ఎంతవరకూ వెళ్లిందంటే, ఎన్నడూ క్రికెట్ బేట్ పట్టుకోకుండా, అసలు ప్రత్యక్షంగా మంచి ఆటైనా చూడకుండా ఎక్కడో జరుగుతున్న ఆటను గురించి రేడియోలో ప్రసారితమయే వార్తలను తన్మయత్వంతో విని, తమలోతాము బ్రహ్మానందంగా చర్చించుకోవడమే కాదు, ఆ రకం ఉత్సాహం లేనివారిని అనాగరికులుగా జమకట్టడం కూడా ఒకవిధమైన సభ్యతా లక్షణమయి ఊరుకొంది——

తన గులాబీమాత్రం అటువంటిదికాదు; చాలా యధార్థమైనది - ఎన్నిముళ్లుంటేనేం, ఎన్నాళ్లయితేనేం, ఓపువ్వు పూసింది సరోజకి ఉత్తరం రాయాలి - అటునుంచి శుభలేఖవచ్చేక రాస్తే సొగసులేదు; ఇవాళే ఇప్పుడే రాయాలి; గులాబీ పూసింది- అమ్మాయిపుడితే "రోజా" అని పేరుపెట్టాలి సరోజ కూతురు రోజా.

★



తెలుగు జిల్లాలకు, నైజాముకు ఏజంట్లు:
శ్రీ సీతారాం జనరల్ స్టోర్సు
బెజవాడ. సికింద్రాబాదు.